# మరణించని మంచితనం

తెల్లవారితే తద్దినం. అందులోనూ కని, పెంచి పెద్దచేసిన మాతృమూర్తిది!

తద్దినానికని నెల మొదట్లోనే జాగ్రత్త పడ్డాడు జగన్నాథం. చివరికి నువ్వులు కూడా అన్ని సామానులతో పాటే కొని, వాటిని విడిగా వుంచాడు. ఒక యిరవై రూపాయలు పెట్టి చీర కొన్నాడు, ముత్తయిదువు కోసం. ముగ్గురు బ్రాహ్మణుల దక్షిణకు పదిహేను రూపాయలు ఒక పొట్లం కట్టి, ఎవ్వరి కంట బడకుండా వుండేందుకు గాను బీరువాలో ఒక మూల భద్రం చేశాడు. ఇంత ముందు జాగ్రత్త ఎందు కంటారేమో! జగన్నాథానికి తెలుసు నెల చివర్లో తన వద్ద ఒక్క చిల్లి గవ్వ కూడా వుండదని. ఇది ప్రతి నెలా నియతిగా జరిగే కథే!

మూడు రోజులు ముందుగా సెలవు చీటీ పంపినా, యక్ష ప్రశ్నలనేకం వేసి కాని ఆఫీసరు సెలవు మంజూరు చెయ్యడు. ఆయన కదొక సరదా! పైగా తిక్కశంకరయ్య అనే బిరుదం కూడా పొందాడు ఆయన. ఇవన్నీ తెలిసిన జగన్నాథం తద్దిన మింకా పదిరోజులుందనగానే, ఒకనాడు అదృష్టవశాత్తూ ఆఫీసరు తన యందు సుప్రసన్నుడై వుండడం పసిగట్టి, అప్పటికప్పుడు ఒక సెలవు చీటీ తయారు చేసి, చేతులు కట్టుకుని ఆయన సమక్షాన నిలిచాడు, మహా బుద్ధిమంతుడిలా. యక్ష ప్రశ్నల తతంగ మేమీ లేకుండానే, సెలవు మంజూరయింది.

ఎంత జాగ్రత్త పడితే మాత్రం యేం లాభం? జగన్నాథం భార్యకు బయటచేరే రోజులవి. తద్దినం నాడే అయితే, ఎంత అభాస! ఇదే కనక తన స్వగ్రామమైతే, యేం ఫరవాలేదు. కావలసినంత బలగం వుంది. ఎవరో ఒకరు వచ్చి అన్ని పనులూ చేసి పెడతారు. ఏ సమస్యా వుండదు. ఇది మదరాసు మహా నగరం? ఎవరి పనులు వాళ్ళ కుంటాయి. అందరికీ

ఆఫీసు తొందరే. అదీకాక, తద్దినం వంటకు తోడు రమ్మంటే ఏమన్నా అనుకుంటారేమో!!

వంట మనిషిని పిలవాలని జగన్నాథం నిర్ణయించుకున్నాడు. భార్య కూడా సరే అంది. అయితే.... పది రూపాయలు కావాలి.

స్నేహితుడు మూర్తి ఇంటికి వెళ్లాడు జగన్నాథం. ఒక పది రూపాయలుంటే బదులిమ్మని అడిగాడు, అన్ని విషయాలూ వివరంగా చెప్పి, అంతా విని మూర్తి సలహా యిచ్చాడు.

''చెపుతున్నానని యేమీ అనుకోకు. అపద్ధర్మం... ఎలాగూ బ్రాహ్మల్ని పిలిచావు కాబట్టి, కాళ్ళు కడిగి, యీసారికి అయిందనిపించు. వాళ్ళూ యేమీ అనుకోరు. అంతగా అయితే, అనుకున్నదాని కంటే ఒక్క రూపాయి ఎక్కువ యిచ్చావంటే సరి, వాళ్ళూ సంతోషిస్తారు.''

జగన్నాథం మనస్సు చివుక్కుమంది. ఎందుకడిగానా అనుకున్నాడు.

''ముష్టి పది రూపాయలు! ప్రతి నెలా సినిమాల కని పది రూపాయలు ఖర్చు పెడుతున్నా. సిగరెట్లకు పది రూపాయలు తగలబెడుతున్నా. వందలు ఖర్చవుతున్నాయి. ఒక్క పది రూపాయలు!'' బాధపడ్డాడు జగన్నాథం. మిత్రునివద్ద సెలవు తీసుకుని యింటికి బయలుదేరాడు.

మిత్రుడు డబ్బివ్వనందుకు జగన్నాథం విచారించలేదు. కాని అతని సలహాను మాటి మాటికి తలుచుకుని విచారించాడు.

ఇంకా పది పన్నెండు యిళ్ళు దాటితే తన యిల్లు వస్తుంది. తల వంచుకుని వెడుతున్నాడు.

వెనక నుంచి, ''జగన్నాథం'' అని ఎవరో పిలిచారు.

వెనక్కి తిరిగి చూశాడు. కాని తెలిసిన వాళ్లెవ్వరూ కనిపించలేదు.

''నిన్నే నాయనా'' అని మళ్లీ వినిపించింది.

పిలిచింది ఒక ముసలాయన. అరవై యేళ్ళుండవచ్చు. సందేహిస్తూ ఆయన్ని సమీపించాడు జగన్నాథం. ఎక్కడో చూచిన జ్ఞాపకం వచ్చింది. కాని ఫలానా అని గుర్తుపట్టలేకపోయాడు.

''అప్పుడే నన్ను మరిచిపోయావుటోయ్'' ఆ ముసలాయన ఆప్యాయంగా పలకరించాడు.

''నువ్వు జగన్నాథం గదూ!''

''అవునండి.''

''ఇంకా నన్ను గుర్తుపట్టలేదన్న మాట!''

''మీది గుడివాడ కాదుటండీ!'' అన్నాడు జగన్నాథం, పాత స్మృతుల్ని నెమరు వేసుకుంటూ.

''మీ బాబాయిగారింట్లో అద్దె కుండేవాళ్లం. నువ్వప్పుడు చిన్నపిల్లవాడివి.''

''చాలా రోజులకు తర్వాత మళ్ళీ మిమ్మల్ని చూచే భాగ్యం కలిగింది, అన్నాడు జగన్నాథం సంతోషం కొద్దీ. ఆ ముసలాయన అప్పుడప్పుడూ తనకు బందరు లడ్లు యిచ్చిన విషయం గుర్తుకు తెచ్చుకుని మరీ సంతోషించాడు.

''మా పెద్దబ్బాయికీ వూళ్లో ఉద్యోగమయింది. వాణ్ణి నువ్వు చూసుండవు.''

''ఏం ఆఫీసండి?''

''ఇన్‌కంటాక్సు ఆఫీసు...''

''మీ రెన్నాళ్ళయింది యిక్కడికి వచ్చి?''

''నిన్న మధ్యాహ్నం మేము వచ్చాం'' అంటూ ఆయన ''ఏమేవ్'' అని పిలిచాడు. ఆయన భార్య వచ్చింది. రూపాయంత కుంకుమ బొట్టూ ఆమె.

''కులాసాగా వున్నారా?'' అంటూ కుర్చీలోంచి లేచాడు జగన్నాథం.

''కూర్చో నాయనా. చాలా రోజులయింది, నిన్ను చూసి.''

ఆమె కూడా కుర్చీలో కూర్చుంది.

''మీ బాబాయి గారింట్లో అంతా కులాసాగా వున్నారా?''

''అంతా కులాసాగానే వున్నారు. మొన్ననే వెళ్ళివచ్చాను.''

''నీకు పిల్లలెంతమంది?''

''ముగ్గురు....''

''అయితే యిక జాగ్రత్త పడవలసిందే'' అన్నాడు ముసలాయన నవ్వుతూ, ఆమె నవ్వి ''ఆయన మాటలకేంలే నాయనా... నువ్వేమీ అనుకోకు'' అంది.

''అబ్బే - యిందులో అనుకునేందుకేముందండి. దేశకాల పరిస్థితులలా వున్నాయి.''

''మంచి మాటన్నావోయ్ జగన్నాథం'' అని ముసలాయన అంటూ వుండగా, పదేళ్ల అమ్మాయి కాఫీ తీసుకువచ్చి జగన్నాథం ముందుంచింది.

''ఇది మా మనమరాలు'' ముసలాయన ఆ అమ్మాయిని తన దగ్గరికి తీసుకున్నాడు.

కాఫీ తాగడానికి జగన్నాథం తటపటాయించడం చూచి ముసలాయన ''ఏమిటోయ్! పట్నం వచ్చి కూడా నీకు కాఫీ అలవాటు కాలేదన్న మాట! బలే వాడివే!'' అన్నాడు.

''మరేమనుకున్నారు మా పిన్నిగారి క్రమశిక్షణ అంటే. పూజా పురస్కారం ముగించకుండా ఆ యిల్లాలు పచ్చి నీళ్ళయినా ముట్టేది కాదు. చల్లని వేళ గుర్తుకి వచ్చింది'' అంది ఆమె.

ఆ దొడ్డ యిల్లాలి కడుపున తాను జన్మించినందుకు గర్వపడ్డాడు జగన్నాథం, మనిషి మంచిగుణానికి మరణం లేదనీ, మంచి మంచి గంధంలా ఎప్పుడూ సువాసనలు వెలార్చుతూ వుంటుందనీ అనుకున్నాడు.

మళ్ళీ ఆమె అన్నది.

'నాయనా, నీకు తెలీదుకాని, మీ అమ్మ కాపరానికి వచ్చిన కొత్తల్లో ఎంత కష్టపడిందనుకున్నావ్! మహా ఓర్పు గల యిల్లాలు కాబట్టి నేర్పుగా సంసారం నెట్టుకొచ్చింది. అప్పటికింకా మీ నాన్నగారికి ఇప్పుడున్న కంపెనీలో ఉద్యోగం రాలేదు. ఏదో మిల్లులో నసుకుంటా పనిచేస్తూ వుండేవారు. జీతం నూరులోపే ననుకుంటా. అంత తక్కువ జీతంలోనే మీ అమ్మ ఎంతో హుందాగా సంసారం చేసింది. ఒక్కనాడన్నా మాసిన చీర కట్టిందనుకున్నావా? లక్ష్మీదేవిలా కలకలాడుతూ కనిపించేది. మీ నాన్నగారన్నా

అప్పుడప్పుడూ చేబదులుగా అయిదూ పదీ తీసుకునేవారుగాని, మీ అమ్మ అప్పులకంటూ పరాయి గడప తొక్కేదా? ఆ ఉన్నదాంతోనే సరిపెట్టుకునేది. అంత మంచిదీ తెలివిగలదీ కాబట్టే, చిన్నతనంలోనే దాటిపోయింది...''

ఆవిడ కళ్ళు చెమ్మగిల్లాయి.

జగన్నాథానికి కళ్ళనీళ్ళ పర్యంతమయింది. అది పసిగట్టి ముసలాయన విషయం మార్చాడు.

'ఏమోయ్ జగన్నాథం, యీ పూట నివ్వక్కడే భోజనం చేసి వెళ్లాలి, తెలిసిందా?''

'ఇంకొకప్పుడు చేస్తాలెండి.'

'మీ ఆవిడ దగ్గర పర్మిషన్ తీసుకోందే భోజనం చెయ్యవన్న మాట!' నవ్వుతూ అన్నాడు ముసలాయన.

జగన్నాథం కూడా మందహాసం చేశాడు.

ముసలాయన్ని మందలిస్తున్నట్టుగా ఆవిడ, అవేం మాటలండీ మరీను అంది.

'ఇంత చనువుగా ఎవరండీ మాట్లిడతారు?' అన్నాడు జగన్నాథం.

'ఁఊఁ... ఆయనకి తగ్గవాడివే దొరికావు.

'రేపు మా అమ్మగారి అబ్దికం. మీరుభయులూ తప్పకుండా రావాలి.'

జగన్నాథం హృదంతరాళాలలోంచి అప్రయత్నంగా వెలువడిన మాటలివి.

'అలాగే నాయనా' అన్నాడు ముసలాయన.

''చూడు బాబూ, అమ్మాయినేం కష్టపెడతావుగాని నేనే వంట చేస్తాను. అమ్మాయి పైపనులు చూసుకుంటే చాలు... మీ షమ్మ ఎంత కలువు గోరుతనంగా ఉండేదని ... మా యింట్లో ఏ కార్యం జరిగినా, మీ అమ్మ వచ్చేది; నడుం కట్టుకుని పని చేసేది,'' ఆవిడ అంది.

తన తల్లి మంచితనాన్ని తలుచుకుని తలుచుకుని మురిసిపోయాడు జగన్నాథం. అమ్మా! నీ మంచి తనాన్ని నేనెలా పొగడను? నువ్వు గతించి

పదేళ్ళయింది. కాని నీ మంచితనం రోజురోజుకి పెరుగుతోంది. నువ్వు...మనస్సులో స్మృతులు రాశిగా పేరుకున్నాయి.

"నాయనా, నేనేదో కష్టపడతానని నువ్వనుకుంటున్నావేమో మనస్సులో. నాకేమీ కష్టంలేదు, తెలిసిందా?"

ఆ వృద్ధదంపతులవద్ద సెలవు తీసుకుని జగన్నాథం ఇంటికి తిరుగు ముఖం పట్టాడు. మాటిమాటికి అనుకున్నాడు మనస్సులో 'అమ్మా! నువ్వు మరణించలేదు. మంచితనానికి మరణం లేదు.'